PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 264 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

## పెరియార్ 147వ జయంతి వేడుకలు


3లో

## విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వాలి


3లో

## వచ్చేనెల 1న కృష్ణా బోర్డు సమావేశం


2లో

# తెలంగాణ నేలది ధిక్కార స్వరం

● భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ● సెప్టెంబర్ 17 ప్రజాస్వామిక పాలనకు ?మార్గం వేసిన రోజు ● రైతులకు భరోసా ఉండాలి...?మహిళలు ఆర్థికంగా ఎదగాలి ● ప్రతి పేదబిడ్డకూ విద్య, వైద్యం అందించడమే లక్ష్యం ● ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి చేరాలనే లక్ష్యంతో పాలన : ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అనీ, సమ్మక్క సారలమ్మ పోరాటం, తెలంగాణ రైతాంగ సాయు ధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ఏది చూసినా అన్యాయాన్ని ఎదిరించడమే తెలంగాణ గడ్డ స్వభావ మని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్ప టికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలిస్తూనే ఉందన్నారు. తెలంగాణ చరిత్ర ప్రజలే కేంద్రంగా పాలన ఉండాలని చెబుతున్నదనీ, అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ, ప్రపంచంతో పోటీపడేలా ప్రజా పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. మిగతా2లో...

# నా దేవాలయ సందర్శనను వక్రీకరించారు

● బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజకీయ స్వలాభం కోసం, పవిత్రమైన దేవాలయ సందర్శనను వక్రీకరించి తనపై అత్యంత చవకబారు ఆరోపణలు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్‌లపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్ రావు పరువు నష్టం దావా దాఖలు చేశారు. తనపై క్షుద్రపూజల ఆరోపణలు చేసిన ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలపై హరీశ్‌రావు తరఫు న్యాయవాదులు గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ క్రిమినల్ వద్ద పరువు నష్టం దావా దాఖలు చేశారు. బీఎన్ఎస్ 2023 చట్టంలోని సెక్షన్ 356 కింద వారిపై కఠిన చర్యలు మిగతా2లో...

# సెమీకండక్టర్ రంగంలో ముందడుగు

● నాలుగేండ్లలోనే లక్ష్యాన్ని సాధించాం :మోడీ ● 76వ ఏట అడుగుపెట్టిన ప్రధానికి పలువురి శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత సెమీకండక్టర్ రంగం రెండో దశలోకి అడుగుపెట్టిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రపంచ దేశాలకు దశాబ్ద కాలం పట్టగా.. భారత్ మాత్రం కేవలం నాలుగేండ్లలోనే ఆ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. సెమీకాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.“కమర్షియల్ చిప్‌ల ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రంగంలో ప్రపంచ దేశాల నమ్మకాన్ని భారత్ సాధించింది. అంతర్జాతీయ మిగతా2లో...

## కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో

# విచారణకు సిద్ధం

ముఖ్యమంత్రికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలి

అసత్యాలతో అసెంబ్లీ పవిత్రతను దెబ్బతీస్తున్న సీఎం

మాపై సస్పెన్షన్ ఎత్తేసి నెలరోజులు సభ జరపాలి :జాతీయ సమైక్యతా దినోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పుట్టిన నాటి నుంచి నేటి వరకు, సీఎం రేవంత్ రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇరు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించి వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 - జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మిగతా2లో...


2లో

## డిసెంబర్ నుంచి ‘హార్వర్డ్’ కోర్సులు

## పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

డిసెంబర్ 30 న తుది ఓటర్ల జాబితా

ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం



2లో


# కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ జరగాల్సిందే..

- టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు



**ఢిల్లీ,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ‘ఆఫ్ ది రికార్డ్’ సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరిగిపోవడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబ భూముల గురించిన వివరాలను చాలా లోతుగా సభ దృష్టికి తీసుకువచ్చారని మిగతా2లో...

# అడ్డంగా దొరికిన కెసిఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల అఫిడవిట్‌తో కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికిపోయిందని, సున్నా నుంచి వేల కోట్ల విలువైన ఆస్తులకు ఎదిగిన భూ బకాసురుడు కెసిఆర్ అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. తనకు ఒక్క ఎకరం కూడా భూమి లేదని 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన కెసిఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు.

మిగతా2లో...

# తెలంగాణ నేలది ధిక్కార స్వరం

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో నిజాం ప్రాంతం అంతర్భాగం కావాలన్న ఆకాంక్షతో ఆంధ్రమహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలు జరిగాయని వివరించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆనాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటానికి రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు నాయకత్వం వహించారని తెలిపారు. ఆపరేషన్ పోలోతో నిజాం ప్రభువు భారత ప్రభుత్వానికి లొంగిపోయారనీ, 1947 సెప్టెంబర్ 17 నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామిక పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రాత్మక సందర్భమని చెప్పారు. అందుకే ప్రజా పాలన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపడం, హక్కులను కాపాడటం, ప్రభుత్వ వనరులు అందరికీ అందేలా చూడటం, ప్రతి మనిషీ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడమే ప్రజా పాలన అని స్పష్టం చేశారు. **ప్రజాప్రభుత్వం రైతు పక్షపాతి** ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి అనీ, రూ.20,616 కోట్లు విడుదల చేసి రుణమాఫీ ద్వారా 23.35 లక్షల రైతుల కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయపడేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి రూ.1.72 లక్షల కోట్లు ఖర్చుచేశామని వివరించారు. భూభారతి చట్టం ద్వారా సంస్కరణలు తీసుకొచ్చామనీ, భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించామనీ, 5.94 లక్షల మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నామనీ, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్‌ఎల్‌బీసీ వంటి పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరిందనీ, ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికమని చెప్పారు. **ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి...ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదగాలి**రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డా ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదిగి సగర్వంగా జీవించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల ఖర్చు ఆదా అయిందని వివరించారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం చేశామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజి, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించామని వివరించారు. మహిళా మార్టులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దెబస్సులు, సోలార్ ప్లాంట్ల ద్వారా మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా నిలబెడుతున్నామని సగర్వంగా చెప్పారు. **ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలి** రాష్ట్రంలోని ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 15 లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేశామనీ, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 45 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామనీ, త్వరలో మరో 2.25 లక్షల మందికి ఇస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్లకు తొలిదశలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామనీ, హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల ద్వారా లక్ష ఇండ్లు కడుతామని తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించామనీ, దాని ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతికి పంపామని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి దేశంలోనే తొలిసారి ఎస్సీ వర్గీకరణ చేపట్టామని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఫిబ్రవరి నాలుగో తేదీన తెలంగాణ సోషల్ జస్టిస్ డేను నిర్వహిస్తున్నామన్నారు. **విద్యా, వైద్యం రెండు కండ్లు** తమ ప్రజాప్రభుత్వానికి విద్యా, వైద్యం రెండు కండ్లలాంటివని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థులకు అల్పాహారం, పాలు ఇచ్చేందుకు రూ.927 కోట్లు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. 11 లక్షలమంది విద్యార్థులకు నేరుగా స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్లనే నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. విద్యారంగంలో తీసుకున్న చర్యలతో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని తెలిపారు. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ ద్వారా ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామనీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2,526 కోట్ల సహాయాన్ని అందించామని వివరించారు. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో నూతన ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం మొదలైందన్నారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించామనీ, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌లను, వరంగల్ ఆస్పత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చారు. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామనీ, ఆ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. యువతలో నైపుణ్యాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామనీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. **మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నాం** రాష్ట్రంలో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామనీ, రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపామనీ, ఆదిలాబాద్, మామునూరు ఎయిర్‌పోర్టులకు అనుమతులు సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తున్నామన్నారు. ఆహార కల్తీని అరికట్టేందుకు టీజీసేఫ్, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, దేశ జీడీపీలో 10 శాతానికి వాటాను పెంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ప్రత్యేక జోన్లతో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలోనే తొలి నెట్ జీరో స్మార్ట్ సిటీగా నిర్మిస్తున్నామన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని చెప్పారు. రీజినల్ రింగురోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్‌అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6,924 కోట్లతో రహదారుల పనులు సాగుతున్నాయన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయనీ, ఈ నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నామని తెలిపారు. దీనిపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించే విషయంలో జర్నలిస్టులు సహకరించాలని కోరారు.

---

# కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తమకు న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందనీ, కేసీఆర్‌పై రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసే సిట్‌లు, సెట్‌లు కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమ వైపు ఏ తప్పైనా బయటపడితే చట్టపరంగా ఎలాంటి శిక్షకైనా తాము సిద్ధమని ప్రకటించారు. **కాంగ్రెస్ హామీలన్నీ బోగస్** కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ బోగస్ అని వెయ్యిరోజుల విఫల పాలన చూశాక తేలిపోయిందని కేటీఆర్ విమర్శించారు. వాటిపై నిలదీస్తామన్న భయంతోనే బీఆర్‌ఎస్‌ను సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. సభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బీజేపీతో రేవంత్ రెడ్డి కుమ్మక్కై అసెంబ్లీని ఏకపక్షంగా నడిపించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కళ్లల్లో కళ్లు పెట్టి చూసే ధైర్యం ప్రతిపక్షానికి లేదన్న రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ధైర్యముంటే శాసనసభ సమావేశాలను నెల రోజులపాటు పొడిగించి, మాపై సస్పెన్షన్లను ఎత్తేయండి. కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదు, 420 హామీల మోసంపై ప్రజల పక్షాన కాలర్ పట్టుకుని నిలదీస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ. నాలుగు వేల పింఛన్లు, రైతులకు కరెంట్, సాగునీరు, రైతుబంధు, అర్ధాంతరంగా రద్దు చేసిన రైతుబీమాపై సభాముఖంగా నిలదీస్తామని చెప్పారు. **ముఖ్యమంత్రి పదవికే రేవంత్‌రెడ్డి కళంకం** చట్టసభల్లో అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు హుందాగా, పెద్దరికంతో మాట్లాడాలే తప్ప అసత్యాలు, అర్ధసత్యాలతో ప్రజలను, రాష్ట్రాన్ని, శాసనసభను తప్పుదోవ పట్టించడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ పవిత్రతను దుర్వినియోగం చేశారనీ, ముఖ్యమంత్రి పదవికే తీవ్ర కళంకం తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూసి అతను కూడా నాలుగు పద్యాలు, కొటేషన్లు, పెద్దల పేర్లు చెప్తే గొప్ప నాయకుడిని అయిపోతానని శ్రీశ్రీ పేరును రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని గుర్తు చేశారు. ఆ మహానుభావుడి పూర్తి పేరు కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు. **సీఎం మాటల్లోనూ అంతే నిజం** పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో 150 బెడ్రూములు ఉన్నాయనీ, బంగారు బాత్రూమ్‌లు కట్టారనీ, కొత్త సచివాలయం కింద నుంచి సొరంగం తవ్వుకుని లంకెబిందెలు తరలిస్తున్నారని చేసిన చిల్లర ప్రచారంలో ఎంత వాస్తవముందో, అసెంబ్లీలో సీఎం మాట్లాడిన మాటల్లోనూ అంతే నిజముందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అభయహస్తం మ్యానిఫెస్టో, ఆరు గ్యారెంటీలు ఏ మేరకు అమలయ్యాయో, ముఖ్యమంత్రి ప్రసంగం కూడా అంతే వాస్తవరూపమని చెప్పారు. మైసూరు బజ్జీలో ఎంతైతే మైసూరు ఉంటుందో రేవంత్ రెడ్డి మాటల్లోనూ అంతే నిజముందని వివరించారు. రూ.80,000 కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని ఊరూరా ప్రచారం చేసి, ఢిల్లీ నుంచి ఆర్టిస్టులను, టూరిస్టులను రప్పించి, నాటకాలతో ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చినట్టే, నేడు కూడా అదే అబద్ధాల వరద పారిస్తున్నారని చెప్పారు. **సిరిసిల్లలో కబ్జా భూములనడం దుర్మార్గం** సిరిసిల్ల పట్టణంలో నిరుపేదలకు, కార్మికులకు దశాబ్దాల క్రితం ఇచ్చిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జా భూములుగా చిత్రీకరించడం అత్యంత దుర్మార్గమని కేటీఆర్ విమర్శించారు.

---

# అడ్డంగా దొరికిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

కెసిఆర్ పుట్టుకతోనే వందల ఎకరాలు భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బిఆర్ఎస్ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. గతంలో కెసిఆర్ ఎన్నికల అఫిడవిట్ ను ఎక్స్‌లో షేర్ చేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తరువాత అధికారంలో ఉన్న పదేళ్లలో కెసిఆర్‌కు భూములు భారీగా పెరిగిన విషయం,కెసిఆర్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ల ద్వారా స్పష్టమవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు, తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే కెసిఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి నిలదీశారు. ఇదంతా ప్రభుత్వ, పేదల, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే కదా అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద కల్వకుంట్ల కుటుంబం లక్షల కోట్ల ఆస్తులను అక్రమంగా సంపాదించుకుంటే డ్రామారావు (కెటిఆర్) మాత్రం పుట్టుకతోనే కెసిఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. మరీ కెసిఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు రాసి మోసం చేసారా? లేక, ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా అని మంత్రి పొంగులేటి నిలదీశారు.ఎన్నికల అఫిడవిట్‌లో ఎకరం భూమినే కెటిఆర్ చూపించారు ఏళ్ల తరబడి కెటిఆర్ తన అమెరికా సక్సెస్ గురించి గొప్పలు చెప్పుకుంటూ చిన్నప్పటి నుంచే తనకు వందల ఎకరాల భూములు ఉన్నాయని చెప్పుకున్నారని, కానీ, ఆయన స్వయంగా దాఖలు చేసిన 2009 ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం అసలు నిజాన్ని చెబుతోందని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. మరీ కెటిఆర్‌కు ఒక ఎకరం ఉన్న భూమి, వందల ఎకరాలుగా, వేల కోట్ల విలువైన భూములుగా ఎలా మారాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. కుటుంబ పాలనలో అక్రమంగా ఆస్తులను కూడబెట్టుకున్న కెటిఆర్ ఇప్పుడు తెలంగాణకు నీతులు చెబుతున్నారని, దెయ్యాలు వేదాలు వల్లిస్తే ఇంతకంటే నమ్మశక్యంగా ఉండేదని ఆయన పేర్కొన్నారు.

## డిసెంబర్ నుంచి 'హార్వర్డ్' కోర్సులు

**హైదరాబాద్:సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ ప్రఖ్యాత 'హార్వర్డ్ యూనివర్సిటీ' హైదరాబాద్‌లో ఔత్సాహికుల కోసం ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని యూకే బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో ఆయన పేర్కొన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. వివిధ యూకే బిజినెస్ స్కూల్స్‌కు సంబంధించిన డీన్‌లు, ఉన్నత స్థాయి అధికారులతో చర్చిస్తూ, విశ్వ విద్యాలయాలకు అవసరాలకు తగ్గట్టు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం రేవంత్‌రెడ్డి వారితో తెలిపారు.

---

## సెమీకండక్టర్ రంగంలో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యాలతో సెమీకండక్టర్ విభాగంపై దేశ విశ్వాసం మరింత బలపడింది. ఈ రంగానికి యువతే కీలకం. వారి నైపుణ్యాలను మెరుగుపరచడంపైనే భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. చిప్‌ల డిజైన్, తయారీలో యువతకు తగిన శిక్షణ ఇస్తున్నాం. సెమీకండక్టర్ లక్ష్యాలను నెరవేర్చడంలో వారే కీలకం" అని మోడీ అన్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కూడా భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ప్రతిబింబించిందని ఆయన గుర్తు చేశారు. సెమీకండక్టర్ ఇండియా-2026 ఈవెంట్ సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు ఢిల్లీలో కొనసాగనుంది. 52 దేశాల నుంచి 600 పైగా కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నాయి. కాగా ప్రధాని మోడీ 76 వ ఏట అడుగుపెట్టడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సహా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## వచ్చేనెల 1న కృష్ణా బోర్డు సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వాటాల పంపిణీపై కృష్ణా బోర్డు సమావేశం నిర్వహించనుంది. వచ్చేనెల 01వ తేదీన 21వ కృష్ణాబోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల అధికారులకు సమాచారం అందించింది. ఈ మీటింగులో నీటి వాటాలతో పాటు వివిధ ప్రాజెక్టులపై చర్చించే అవకాశం ఉంది. ఎల్ నినో నేపథ్యంలో ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటిని కేవలం తాగునీటికే వాడుకోవాలని ఇప్పటికే బోర్డు స్పష్టం చేసింది. ఈ నెల 4న త్రీమెంబర్ కమిటీ మీటింగ్‌లో 50:50 నిష్పత్తిలో నీళ్లను పంచాలని మన రాష్ట్రం డిమాండ్ చేయగా ఎపి ఎప్పటిలాగానే 66:34 రేషియోలో పంచాలని సూచించింది.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలైంది. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు హైదరాబాద్-రంగారెడ్డి, వరంగల్-ఖమ్మం ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితా షెడ్యూల్‌పై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవి కాలం మార్చి 2027 నాటికి ముగియనుందని తెలిపారు. 2026 నవంబర్ 1ని ఓటరు నమోదుకు అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుందనీ, నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుందని తెలిపారు. డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నామని తెలిపారు. గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫారం-18తో పాటు ధ్రువీకరించిన విద్యార్హత పత్రాలు సమర్పించాలన్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో అవకాశం ఉందని చెప్పారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, డిజిగ్నేటెడ్ అధికారుల వద్ద ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పోస్టు ద్వారా కూడా ఫారం-18 దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు.**ఓటర్ షెడ్యూల్ వివరాలు...** 1). సెప్టెంబర్ 28న ఓటర్ల నమోదు ప్రక్రియకు నోటిఫికేషన్ 2). నవంబర్ 1, 2026 అర్హత తేదీగా ఓటర్ల జాబితా తయారీ 3).నవంబర్ 6 వరకు ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ 4).నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల 5).నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ 6). డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

## కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ జరగాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 2004, 2009 ఎన్నికల అఫిడవిట్లలో కేసీఆర్‌కు భూములు లేవని పేర్కొన్నారని, కానీ 2014 నాటికి 35 ఎకరాలు, 2018లో మరింత పెరిగి, 2023 నాటికి 53 ఎకరాలు ఉన్నట్లు చూపించారని వివరించారు.2023 నాటికి కేటీఆర్ కుటుంబ పేరిట 123 ఎకరాలు వచ్చాయని, 2026 నాటికి కేటీఆర్ 67 ఎకరాలు కొనుగోలు చేశారని తెలిపారు. సమర్పించిన అఫిడవిట్లకు, అసలు ఆస్తులకు ఎక్కడా పొంతన లేదని, తెలంగాణలో గజం భూమి లేని పేదలు ఎందరో ఉండగా కేసీఆర్ కుటుంబానికి ఇన్ని భూములు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న భూములపై కచ్చితంగా సమగ్ర విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. తాము వారిని బదనామ్ (ప్రతిష్ట దిగజార్చడం) చేయడానికి ఈ విషయాలు మాట్లాడటం లేదని, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత రాష్ట్రంలోని దళితులు, బీసీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని అన్నారు.జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ అంటున్నారని, కానీ ఆయన అక్కడే ఉంటున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ ఫామ్‌హౌస్‌ను నిర్మించారని ఆరోపించారు. అయితే, ప్రభుత్వం ఎవరి ప్రైవేట్ ఆస్తులను లాక్కునే ఉద్దేశంతో లేదని స్పష్టం చేశారు.22ఏ నిషేధిత జాబితా విషయంలో ఎక్కడో ఒకచోట అధికారుల తప్పిదం ఉండి ఉండవచ్చని, దానిపై కూడా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ నిబంధనను ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ తమ స్వార్థం కోసం పెట్టలేదని స్పష్టం చేశారు.స్పీకర్ తల్లిపై బీఆర్ఎస్ నేతలు వాడిన భాష ఏమాత్రం మంచిది కాదని హితవు పలికారు. పోలీసుల పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. గతంలో కేసీఆర్ ఢిల్లీలో ఉన్న ఇంటికి, ప్రగతి భవన్‌కు బుల్లెట్ ప్రూఫ్ తలుపులు ఏర్పాటు చేసుకున్న తీరును గుర్తుచేశారు.అలాగే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ గణనీయంగా పెరిగిందని, గతంలో పనిచేసిన ఇంచార్జ్‌లు కూడా బాగానే పనిచేశారని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు.

## నా దేవాలయ సందర్శనను వక్రీకరించారు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలను, పత్రికల్లో వచ్చిన ప్రకటనలను పెన్‌డ్రైవ్‌ల ద్వారా న్యాయమూర్తికి అందజేశారు. గత నెలలో కుటుంబ సభ్యులతో కలిసి హరీశ్‌రావు కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా దేవి ఆలయాన్ని సందర్శించుకున్న విషయం తెలిసిందే. ఈ ఆధ్యాత్మిక పర్యటనను కాంగ్రెస్ నేతలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని కోరుకుంటూ క్షుద్రపూజలు చేశారంటూ మహేశ్‌గౌడ్, అద్దంకి దయాకర్‌లు గాంధీ భవన్ వేదికగా, మీడియాతోపాటు సోషల్ మీడియాలో పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు.రాజ్యాంగబద్ధమైన, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు, కేవలం రాజకీయ దురుద్దేశంతో వ్యక్తి వ్యక్తిత్వాన్ని, ఆయన విశ్వాసాలను కించపరిచేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించామని తెలిపారు.పూజలను కూడా రాజకీయ బురద చల్లడానికి వాడుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కల్పిత ఆరోపణలపై గత నెలలోనే తన న్యాయవాదుల ద్వారా ఆ ఇద్దరు నేతలకు లీగల్ నోటీసులు పంపామని తెలిపారు. తాము చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశామని పేర్కొన్నారు. మహేశ్‌కుమార్ గౌడ్‌కు వచ్చిన నోటీసును కనీసం తీసుకోకుండా ఉద్దేశపూర్వ కంగా తిరస్కరించారనీ, అద్దంకి దయాకర్ వ్యాఖ్యలను సమర్థించుకుంటూ పొంతన లేని సమాధానం ఇచ్చారని వివరించారు. వారు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే అవకాశం ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదనీ, న్యాయస్థానం ద్వారానే తగిన గుణపాఠం చెప్పించాలనే ఉద్దేశంతో కోర్టును ఆశ్రయించామని తెలిపారు.

# పెరియార్ 147వ జయంతి వేడుకలు

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** బెల్లంపల్లి పట్టణంలోని మహనీయుల విగ్రహాల వద్ద పూలేపెరియార్అంబేద్కర్ ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ద్రావిడ ఉద్యమనేత పెరియార్ ఈ.వి. రామసామి 147వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.వేదిక అధ్యక్షులు గొడిసెల శ్రీహరి మాట్లాడుతూ సమాజంలో కుల, మత, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా పెరియార్ జీవితాంతం పోరాడారని తెలిపారు. కుల వ్యవస్థ, అంటరానితనం, మూఢనమ్మకాలు, సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా స్వీయ గౌరవ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. స్త్రీలకు పురుషులతో సమాన హక్కులు, అవకాశాలు, స్వేచ్ఛ కల్పించాలనే భావనను బలంగా ప్రచారం చేశారని అన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్.



అంబేద్కర్, పెరియార్ ఈ.వి. రామసామి వంటి సామాజిక సంస్కర్తలు సమానత్వం, సామాజిక న్యాయం కోసం విశేషంగా కృషి చేశారని శ్రీహరి పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, సామ్యవాద భావనలు, కుల నిర్మూలన, స్త్రీల అభ్యున్నతి వంటి అంశాలపై పెరియార్ ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు.పెరియార్ సామాజిక సంస్కరణలపై చేసిన కృషిని గుర్తిస్తూ 1970 జూన్ 27న యునెస్కో ఆయనను "ఆసియన్ సోక్రటీస్"గా అభివర్ణించిన విషయాన్ని శ్రీహరి గుర్తుచేశారు. సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, స్వాభిమానం కోసం పెరియార్ సాగించిన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్, సిపిఐ మార్క్సిస్టు అంబేద్కర్ పార్టీ అధ్యక్షులు సంకె రవి, బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గం రాజయ్య, వేదిక ఉపాధ్యక్షులు అక్కు కృష్ణ, ప్రచార కార్యదర్శులు గొడిసెల చంద్రమౌళి, జంజర్ల రవిరాజ్, గొడిసెల సరిత, లంబాడి తండా గ్రామపంచాయతీ సర్పంచ్ సాగర్ల లక్ష్మణ్, మాటూరి కృష్ణ, తిరుపతి, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నాయకులు కన్నూరి సమ్మయ్య, కాదశి ప్రకాష్, ముంజం ప్రేమాకుమార్, మనోజ్, ఆగడి కార్తీక్, కొండేటి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

**• ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షులు మడికొండ రఘుపతి**

**ములుగు, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాలను అర్థాంతరంగా మూసివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు వెంటనే టీసీలు, సంబంధిత విద్యా సర్టిఫికెట్లు అందజేయాలని ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షులు మడికొండ రఘుపతి డిమాండ్ చేశారు.మహర్షి డిగ్రీ కళాశాలలో మొదటి, రెండో సంవత్సరాలు పూర్తి చేసిన పలువురు విద్యార్థులు ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరారు. అయితే అడ్మిషన్ల



గడువు సమీపిస్తుండటంతో మొదటి, రెండో సంవత్సరాలకు సంబంధించిన టీసీ, ఇతర సర్టిఫికెట్లు సమర్పించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యం కోరుతున్నట్లు విద్యార్థులు తెలిపారు.ఈ నేపథ్యంలో మహర్షి డిగ్రీ కళాశాల యాజమాన్యాన్ని విద్యార్థులు పలుమార్లు కలిసి తమకు టీసీలు, సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరినప్పటికీ, ఫీజు చెల్లించిన తర్వాతే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యం చెబుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో చేరే సమయంలో స్కాలర్‌షిప్ వచ్చిన తర్వాత ఫీజులు చెల్లించవచ్చని చెప్పారని, మధ్యలో కళాశాల మూసివేసిన అనంతరం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ సమస్యపై కళాశాల యాజమాన్యం వెంటనే విద్యార్థులతో చర్చించి పరిష్కార మార్గం చూపాలని రఘుపతి కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫైనల్ ఇయర్ చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన టీసీలు, విద్యా సర్టిఫికెట్లు తక్షణమే అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గిరిజన రిజర్వేషన్ 6 నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దే

**మల్లంపల్లి, సెప్టెంబర్ 17: (పిసిడబ్ల్యూ న్యూస్):** గిరిజనులకు రిజర్వేషన్లు పెంచి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మల్లంపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ మాజీ సీఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు కలిసి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ గిరిజనులకు ఉన్న రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి మాజీ సీఎం కేసీఆర్ అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా, కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ప్రజల పట్ల,ముఖ్యంగా రాష్ట్రంలోని గిరిజనుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.గిరిజనులు నాయకులుగా ఎదగాలనే ఉద్దేశంతో కేసీఆర్ హయాంలో తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారని తెలిపారు.కేసీఆర్ పాలనలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు.రోడ్లు,మంచినీటి సౌకర్యాలు లేని ప్రాంతాలను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించారని,గిరిజన



తండాల్లో నాయకత్వం కూడా అభివృద్ధి చెందిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి కార్యక్రమాల కంటే కేసీఆర్‌ను విమర్శించడంపైనే ఎక్కువ దృష్టి ఉందని లక్ష్మణ్ బాబు ఆరోపించారు.గిరిజనులు,పేద ప్రజల కోసం కేసీఆర్ చేసిన కృషి ప్రజలకు తెలుసన్నా ఆయన,ములుగు జిల్లాలో గిరిజనులకు ఇళ్ల నిర్మాణం విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఇప్పటివరకు ఎంతమందికి ఇళ్లు ఇచ్చారు,ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఇంకా ఎంతమందికి ఇళ్లు నిర్మించి ఇస్తారో మంత్రి సీతక్క వెల్లడించాలని కోరారు.ప్రస్తుతం చెబుతున్న లెక్కల ప్రకారం ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం 30 నుంచి 40 శాతం కూడా పూర్తికాలేదని,కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజల్లో ఇప్పటికే గుర్తుండిపోయిందని,ప్రస్తుత ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం లేదని విమర్శించారు.అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్, బీఆర్ఎస్‌పై అసత్యాలు మాట్లాడుతున్నారని లక్ష్మణ్ బాబు ఆరోపించారు.ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రైతులు, గిరిజనులు,మహిళలు,ఉద్యోగులు,విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రైతులకు సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కూడా ప్రభుత్వం రాజకీయ ఉద్దేశాలతో వ్యవహరిస్తోందని,కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ నిర్మించి రైతులకు సాగునీరు అందిస్తే, కాలేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయం చేస్తూ ఆ నీటిని ఎత్తకుండా కేసీఆర్ పేరును చెడగొట్టాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు.అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం,సభ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని,ఇప్పటికైనా డైవర్షన్ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు.కేసీఆర్ గిరిజనులు, పేద ప్రజల కోసం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**కల్లూరు, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీ తనంతో కూడిన పాలన అందించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.**తుమ్మలపల్లి రీసర్వేకు రైతులు సహకరించాలి** పెనుబల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో త్వరలో చేపట్టనున్న భూ రీసర్వే ప్రక్రియకు సంబంధించి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ గ్రామ



రైతులతో సమావేశమై విస్తృతంగా చర్చించారు. రీసర్వే యొక్క ఉద్దేశ్యం, భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల నవీకరణకు సంబంధించిన అంశాలను రైతులకు వివరించారు.ఈ సందర్భంగా రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు, సందేహాలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిశీలించి తగిన విధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు రైతులతో సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలను సిద్ధంగా ఉంచుకుని రీసర్వే ప్రక్రియలో అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. రీసర్వే ద్వారా భూ రికార్డులను సక్రమంగా నవీకరించి, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# విశ్వకర్మ జయంతి వేడుకలు





**పరకాల, సెప్టెంబర్ 17 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు, స్వర్ణకార సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విశ్వకర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సైలు పవన్, రఘుపతి హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్, 12వ వార్డు కౌన్సిలర్ ఆకుల శ్రీధర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు. స్వర్ణకార సంఘం రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు, పుర ప్రముఖులు, సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.విశ్వకర్మ జయంతి సందర్భంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పలువురు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వేడుకల సందర్భంగా పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ స్వర్ణకార సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వం డిగ్రీ కళాశాల పరకాలలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**పరకాల, సెప్టెంబర్ 17 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం డిగ్రీ కళాశాల పరకాలలో చరిత్ర, రాజనీతి శాస్త్రం మరియు ఎన్ఎస్ఎస్ విభాగము ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. సంతోష్ కుమార్ కళాశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తదనంతరం జరిగిన వేడుకల్లో ప్రిన్సిపల్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలన నుండి విముక్తి పొందిన సందర్భాన్ని గుర్తు చేస్తూ, స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఆడెపు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన తీరును మరియు మన భారతదేశానికి ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం రావడానికి గల కారణాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల చరిత్ర విభాగము అధిపతి ప్రొఫెసర్ ఎన్ మల్లయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రజలు ఎలాంటి అణిచివేతలకు గురి అయ్యారో తెలుపుతూ ఆనాడు జరిగిన అనేక ఉద్యమాలను విద్యార్థులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ జి రామకృష్ణ, కళాశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ అశోక్ అలిశాల, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి అధ్యాపకులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో జెండా ఆవిష్కరణ




**మల్లంపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్ ):** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శ్రీనగర్ గ్రామపంచాయతీలో గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆకుల మల్లేష్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుల మల్లేష్ మాట్లాడుతూ ప్రజాపాలన స్ఫూర్తితో గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి స్వర్ణ, ఉపసర్పంచ్ గుగులోత్ అరుణ, వార్డు సభ్యులు ఇమ్మడి సమ్మయ్య, తోట ఉమా, ఆకుల రమేష్, ఎర్రం సంధ్య, బిలావత్ రమేష్, బిలావత్ అనుష, అజ్మీర శంకర్, పీఆర్ఆర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, అఖిల్, అంగన్వాడీ టీచర్ ఉమారాణి, ఖీూ వెంకన్న, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ - బీఆర్ఎస్ చీకటి ఒప్పందం ఉందా?

**- కాళేశ్వరం సీబీఐ విచారణ జాప్యానికి సెట్టింగే కారణమా?**




**కరీంనగర్, సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణలో జాప్యానికి కారణమేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల భూదాహాన్ని సీఎం రేవంత్ రెడ్డి బయటపెడితే, బండి సంజయ్ వాటిని ఎందుకు వక్రీకరిస్తున్నారని నిలదీశారు.కరీంనగర్ స్మార్ట్ సిటీ పనుల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై బండి సంజయ్ ఏనాడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధికి వస్తున్న నిధులన్నీ బీజేపీనే తీసుకొచ్చినట్లు ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కొబ్బరికాయలు కొట్టడం కాకుండా కేంద్రం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.గణేష్ నిమజ్జనానికి నీటి విడుదలతో పాటు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంటే, బీజేపీబీఆర్ఎస్ నేతలు నీటి విడుదల అంశాన్ని వివాదాస్పదం చేయాలని చూస్తున్నారని నరేందర్ రెడ్డి విమర్శించారు.

# జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు..

**● అమరుల స్ఫూర్తితో తెలంగాణను కాపాడుకోవాలి..**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** అమరుల పోరాట స్ఫూర్తితో తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ అన్నారు. సెప్టెంబర్ 17 సందర్భంగా చింతకుంటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నారదాసు లక్ష్మణరావు జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం ఎందరో అమరులు పోరాడారని గుర్తుచేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో భారత సైన్యం హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన చారిత్రక ఘట్టాన్ని వివరించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. సెక్యులర్ రాష్ట్రంగా తెలంగాణ వర్ధిల్లిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ , కార్పొరేటర్ గడ్డి ప్రదీప్ యాదవ్ , మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్ , మాజీ కార్పొరేటర్ లు గందె మాధవి మహేష్ , మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్ , నారదాసు వసంత రావు, గంటల రేణుక ,పలు డివిజన్ ల అధ్యక్షులు ఆరే రవి గౌడ్, పటేల్ సుధీర్ రెడ్డి,నియోజక వర్గ యూత్ అధ్యక్షులు గంగాధర చందు ,నగర బీ ఆర్ ఎస్ వీ అధ్యక్షులు బొంకూరి మోహన్ , మిడిదొడ్డి నవీన్ , బోనాల శ్రవణ్ , కలర్ సత్తన్న , కమల్ గౌడ్ , నిజమొద్దిన్, సర్వర్ ,అన్వేష్ ల తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటం మతాల మధ్య కొట్లాట కాదు: గుండెబోయిన చంద్రయ్య



**ములుగు సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని ఎంసీపీఐ(యూ) ములుగు జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా మల్లంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో జంగిలి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ పోరాటం వెనుక భూస్వాములు, జాగీర్దారుల దోపిడీ, వెట్టిచాకిరీ, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటం ప్రధానంగా ఉందన్నారు. చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి పోరాట యోధుల త్యాగాలను ఆయన గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేవలం హిందూముస్లిం ఘర్షణగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను పక్కదారి పట్టించడమేనని అన్నారు. సెప్టెంబర్ 17కు సంబంధించి రాష్ట్రంలో భిన్నమైన చారిత్రక, రాజకీయ వివరణలు ఉన్నప్పటికీ, పోరాటంలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమాలను కూడా గుర్తించాలని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని, తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంగిలి సుధాకర్, సంఘని రాజన్న, మాదాసు ఆదిరెడ్డి, కోట సాంబయ్య, ఆరేపల్లి సదయ్య, సారా సాంబయ్య, బోయిని సాంబయ్య, అయితే సూరయ్య, మాతంగి కుమారస్వామి, వేముల శ్రీనాథ్, వడ్లూరి వెంకన్న, బొమ్మిడి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో సేవా సంకల్ప్ అభియాన్‌లో సేవా కార్యక్రమాలు

**● పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ**

**● ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**



**ములుగు, సెప్టెంబర్ 17( పి సి డబ్ల్యూ న్యూస్ ):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ములుగులో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ పార్క్‌లోని మున్సిపల్ అతిథి గృహంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు హాజరై చీరలు అందజేశారు. మాజీ ఎంపీలు అజ్మీరా సీతారాం నాయక్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ములుగు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో ప్రజాసేవ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, సామాజిక సేవలకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, రాష్ట్ర, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరశీ ప్రారంభం: గ్రామ సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావు



**కల్లూరు, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో కొత్త యర్రబోయినపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత గోపాలమిత్ర శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పోటు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి పోట్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామంలో పశువులు గురించి రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, దోమకాటు వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన రైతులకు చూసించరు. ఈ శిబిరంలోని 28 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ రూపు కుమార్ మాట్లాడుతూ పశువు మూడవ నెలలోనే మరలా తిరిగి కట్టించాలి కట్టించిన మూడవ నెలలో చూడు పరీక్ష చేపించాలని చూసించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ మమత, గోపాలమిత్ర సూపర్వైజర్ టి, వెంకటేశ్వర్లు, కృష్ణ ప్రసాద్, బి వెంకటేశ్వర్లు, అప్పారావు, కోటేశ్వరరావు, విజయ్ కుమార్, శివకృష్ణ హనుమంతరావు, పి వెంకటేశ్వర్లు, రమేష్ , విజయ భాస్కర్, గ్రామ రైతుల పాల్గొన్నారు.

# తెలంగాణ చరిత్రలో మహోన్నత ఘట్టం.. ప్రజాపాలనకు మార్గదర్శకం


**● ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం ● ములుగులో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ● జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క**

**ములుగు జిల్లా సెప్టెంబర్17( పి సి డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 మహోన్నత ఘట్టమని, నాటి పోరాట స్ఫూర్తి ప్రజాపాలనకు మార్గదర్శకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సెప్టెంబర్ 17వ తేదీకి భారతదేశ, తెలంగాణ చరిత్రలో విశిష్టమైన స్థానం ఉందన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నాటి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కాలేదని తెలిపారు. నిరంకుశ పాలనతోపాటు రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు, యువత ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని చాటిన ఈ చారిత్రక సందర్భాన్ని ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. నాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే వారికి అందించే నిజమైన నివాళి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ, రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రవిచందర్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, వయోవృద్ధులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని మోదీ 76వ జన్మదినం సందర్భంగా 'మోదీ వాణి' గ్రంథావిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 17(పి సి డబ్ల్యూ న్యూస్):**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన 'మోదీ వాణి సేవ c సంకల్పం c వికసిత భారత్' త్రిభాషా గ్రంథాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సంయుక్తంగా ఆవిష్కరించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఉదయం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, ప్రముఖ రాజకీయ–సామాజిక విశ్లేషకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ఈ గ్రంథాన్ని సంకలనం చేశారు.ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ గత పన్నెండేళ్ల కాలంలో స్వదేశంలోనూ, విదేశాల్లోనూ చేసిన చారిత్రక ప్రసంగాలను లోతుగా పరిశీలించి, ప్రజాదరణ పొందిన ప్రామాణిక వ్యాఖ్యలు, కొటేషన్లను ఇందులో పొందుపరిచారు. మోదీ ఆలోచనలు, పాలనా దృక్పథం, జాతీయ దార్శనికతను సమగ్రంగా ప్రతిబింబిస్తూ ఆయన 76వ పుట్టినరోజు కానుకగా ఈ



పుస్తకాన్ని వెలువరించారు.**'మోదీ వాణి' గ్రంథ విశేషాలు:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాల నుంచి సేకరించిన ప్రామాణిక కొటేషన్లతో కూడిన సమగ్ర త్రిభాషా సంకలనం.ప్రధాని ప్రసంగించిన అసలు హిందీ వాక్యాలతో పాటు వాటి సహజమైన తెలుగు, ఆంగ్ల అనువాదాలను ఇందులో అందించారు.ప్రధాని అధికారిక ప్రసంగాలు, విశ్వసనీయ ఆధారాలను లోతుగా పరిశీలించి అంశాల వారీగా కొటేషన్లను ఎంపిక చేశారు.ప్రతి వ్యాఖ్యకు సంబంధించిన నేపథ్యం, ప్రసంగ సందర్భం, మూల వివరాలను స్పష్టంగా వివరించారు.సేవ, సంకల్పం, సుపరిపాలన, అంత్యోదయం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, యువశక్తి, రైతు సంక్షేమం, ఆత్మనిర్భర్ భారత్, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ పరిరక్షణ, విశ్వవేదికపై భారత నాయకత్వం వంటి విభిన్న అంశాలను ఇందులో పొందుపరిచారు.మ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతకుమార్, జయశ్రీ, కల్యాణ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, డాక్టర్ వేముల అశోక్, టి. వీరేందర్ గౌడ్, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, సీనియర్ నాయకులు శ్రీని రెడ్డి, గోపాల్ జీ, సుభాష్ చంద్ర జీ, రాణి రుద్రమ, పద్మ తదితరులతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు, విశ్వకర్మ జయంతి వేడుకలు....



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు, దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవ వేడుకలు,విశ్వకర్మ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించారు. కరీంనగర్లో జరిగిన వేడుకలకు బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం రజాకారుల రాక్షస పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన చారిత్రక దినం సెప్టెంబర్ 17 అని ఆయన గుర్తుచేశారు. ఎంతో మంది అమరుల త్యాగాల ఫలితంగానే విముక్తి సాధ్యమైందని, నాటి పోరాటయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. రజాకర్ వారసుల పార్టీ కి భయపడే కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని ఆయన ఆరోపించారు. **ఘనంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవ వేడుకలు..** ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ మహాశక్తి దేవాలయంలో ఆయుష్మ హోమం, గణపతి హోమం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాని మోదీ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం



మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి , దేశానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా నిలుస్తోందని కొనియాడారు.**బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు...** బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం రోజున కరీంనగర్లో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయిని మల్లేశం విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. .శ్రామిక లోకానికి ఆరాధ్య దైవమైన భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా దేశంలోని సమస్త కార్మిక లోకానికి, చేతివృత్తిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.. దేశ నిర్మాణంలో శిల్పులు, చేతివృత్తి నిపుణుల పాత్ర ఎనలేనిదన్నారు. ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు మాట్లాడుతూ సమాజానికి విశ్వకర్మలు దిక్సూచిగా ఉన్నారని, విశ్వకర్మలు లేని సృష్టి లేదన్నారు. ఈ వేడుకల్లో మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, కార్పొరేటర్ లు బండ రమణారెడ్డి , బండారి వేణు , ఎన్నం ప్రకాష్, కర్రే అనిల్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు మోతే గంగారెడ్డి , అడిచర్ల రాజు, పుప్పాల రఘు, కనుమల్ల గణపతి, కటకంలోకేష్, దురిశెట్టి సంపత్, జాన పట్ల స్వామి , కోలా అశోక్, వైద రామానుజమ్, కడార్ల రతన్, గర్దాస్ సతీష్, గుంజేటి శివకుమార్, గాజుల సప్న, సుధాకర్ పటేల్, వాసు, కైలాస నవీన్, కందుల వెంకటేష్ వెంగళ రవిగోపాల్, కొమ్ము మధుకర్, దయ్యాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతి సందర్భంగా క్యాన్సర్ రోగులకు పండ్ల పంపిణీ..




**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో గురువారం చెల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బొమ్మకల్, కరీంనగర్ లో క్యాన్సర్ రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని క్యాన్సర్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులకు తాజా పండ్లను పంపిణీ చేసి, వారికి ఆత్మీయత, ధైర్యం మరియు మానవతా సహకారాన్ని అందించారు. అనంతరం రోగుల సేవలో నిరంతరం కృషి చేస్తున్న వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగమరాజు, మ్యాడం శివకాంత్ పటేల్, బట్టు వినోద్ పటేల్, మెతుకు కృష్ణ చైతన్య, ఐత సూరజ్, కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైద్య సేవలకు గుర్తింపుగా డా. ఎజిలరసి రవీంద్రన్, డా. పెద్ది రజిత, డా. ప్రశాంత్ కుమార్ లను సన్మానించారు. క్యాన్సర్ రోగులకు పండ్ల పంపిణీ ద్వారా వారికి మానసికంగా ధైర్యాన్ని అందించడంతో పాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

## శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్



**మరిపెడ, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** మరిపెడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న సివిల్ కోర్టు శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ స్థలాన్ని పరిశీలించి, అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. కోర్టు ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన మౌలిక వసతులు, వేదిక, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. మరిపెడలో నూతన సివిల్ కోర్టు ఏర్పాటు కావడం వల్ల మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కానున్నాయని డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ తెలిపారు. ప్రజలు న్యాయపరమైన అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గి, స్థానికంగానే న్యాయ సేవలు పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలను పరిశీలించిన కరీంనగర్ సిపి..



**రామడుగు 17 సెప్టెంబర్ (పిసి డబ్ల్యూ న్యూస్ ):** రామడుగు మండల కేంద్రంలోని గణేష్ మండపాలను గురువారం కరీంనగర్ సిపి గౌస్ ఆలం పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకవర్గం ఆయనను గౌరవంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ సిపి విజయ్ కుమార్ సీఐ ప్రదీప్ కుమార్ఎస్ఐ కే రాజు స్థానిక సర్పంచ్ మోయిజ్, పాలకవర్గం పాల్గొన్నారు

## సింగరేణిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**సత్తుపల్లి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ సత్తుపల్లి ఏరియాలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి సత్తుపల్లి స్పెషల్ ఏరియా జనరల్ మేనేజర్ ఎస్ వెంకటచారి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జీఎం ఎస్ వెంకటచారి మాట్లాడుతూ ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా, సంస్థ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో ఉద్యోగులు, అధికారులు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సెక్యూరిటీ సిబ్బంది జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ వేడుకలకు ఎస్ఓటు జీఎం బొల్లం శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి కోటేశ్వరరావు, సీఎంఓఏఐ సత్తుపల్లి ఏరియా ప్రెసిడెంట్ ఏ. ఎల్. ఎస్. వి. సునీల్ వర్మలతో పాటు సత్తుపల్లి ఏరియా ఇంజనీర్, పర్చేస్ ఆఫీసర్, వివిధ్య గనులు, డిపార్ట్‌మెంట్ల హెచ్ఓడీలు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గొల్లగూడెంలో జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు



**తల్లాడ, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూన్యూస్)** :జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలం లో గొల్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోదూరి ఉమాదేవి వీరకృష్ణ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ సమైక్యతా దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉమాదేవి వీరకృష్ణ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, రజాకారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం చారిత్రాత్మకమన్నారు. భారత సైన్యం హైదరాబాద్ రాజ్యంలో ప్రవేశించి నిజాం, రజాకారుల బలగాలను అణచివేసి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సెప్టెంబర్ 17వ తేదీ చరిత్రలో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కావడంతో తెలంగాణ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగు వచ్చిందన్నారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ నాయకుడు కోదూరి వీరకృష్ణ, వార్డు సభ్యురాలు బొగ్గుల కృష్ణవేణి, కోదూరి దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి నరేష్ , ఫీల్డ్ అసిస్టెంట్ ఇశ్నేపల్లి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు మరియమ్మ, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి సీతక్కకు సంఘం నాయకుల వినతి



**ములుగు సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై గురువారం ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించాలని, మేడారం జాతర సందర్భంగా నాయి బ్రాహ్మణులకు ఉచిత డిజిటల్ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకుల వినతిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని హామీ ఇచ్చినందుకు సంఘం నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ కట్టల రాష్ట్ర అధ్యక్షులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం జనశక్తి రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నం మోహన్ కుమార్, నాయి బ్రాహ్మణ సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు వేల్పుగొండ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తంగేళ్లపల్లి శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మురహరి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు జంపాల రవీందర్, మండల సతీష్, కోశాధికారి నడిగోటి వేణు, నాయకులు వి. రఘువీర్, వి. కృష్ణ, వి. గౌతమ్, రాకేష్, ప్రభాకర్, తిరుపతి, ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపల్లిలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు




**మల్లంపల్లి, సెప్టెంబర్ 17( పి సి డబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో మల్లంపల్లి మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ గారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17, 1948న సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి చొరవతో ఆపరేషన్ పోలో ద్వారా నిజాం రజాకార్ల నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని అన్నారు. ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినంగా జరుపుతుండడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు దండిగా వెంకన్న బీజేవైఎం జనరల్ సెక్రెటరీ కత్తి హరీష్ మండల ఉపాధ్యక్షులు బండి బాబు గూడెల్లి కొమురెల్లి కొండ యుగంధర్ మండల జనరల్ సెక్రెటరీ ఎండిగ రాజు మండల కార్యదర్శి పోతరాజు సంపత్ సీనియర్ నాయకులు బొమ్మ రాతి సారన్నా పోతరాజు రమేష్ గొట్టేముక్కల నరేష్ శర్మ రాగుల శ్రీకాంత్ గుంటుక సురేష్ బొమ్మర వేన అజయ్ రాచర్ల వరుణ్ గొట్టేముక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లంపల్లిలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన సర్పంచ్ ల్యాద శ్యామరావు




**జేడీ మల్లంపల్లి సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్లంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి జెండాకు గౌరవ వందనం సమర్పించారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యతను స్మరించుకోవడంతో పాటు ప్రజాస్వామ్య పాలన, ప్రజల భాగస్వామ్యం, జాతీయ సమైక్యత, రాజ్యాంగ విలువలను గుర్తుచేసుకోవడం ప్రజాపాలన దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం, పారదర్శకమైన పాలన అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకం సురేష్ ముదిరాజ్, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి కార్యాలయంలో ఘనంగా తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలు



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17(పిసి డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర విలీన దినోత్సవం సందర్భంగా నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం హాజరై కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లిఆరెపల్లి మోహన్ తో పాటు పార్టీ శ్రేణుల సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు పంచుతూ, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, ఎండి తాజ్, మడుపు మోహన్, కొరివి అరుణ్ కుమార్ ,పర్వత మల్లేశం, గుమ్మడి రాజకుమార్, కాంతాల జగన్ రెడ్డి, కామ్ రెడ్డి రామ్ రెడ్డి,ముస్తాక్, పత్తి మధుకర్, అహమ్మద్ అలీ, మాదాసు శ్రీనివాస్, కుంభాల రాజకుమార్, హస్తపురం తిరుమల,మాలోతు మహాలక్ష్మి, రామిడి తిరుపతిరెడ్డి, వంగల విద్యాసాగర్,కంకణాల అనిల్ కుమార్ గుప్తా,మూల జయపాల్, అందే శంకర్, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి విక్టర్, సుకుర్ మహమ్మద్, రాచర్ల పద్మ, శ్రీకాంత్, సాయిని తిరుపతి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## సేవకుని కుటుంబానికి ఆర్థిక చేయూత

- మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ గొల్లమందల నోవా



**కల్లూరు, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :అనారోగ్యంతో మృతి చెందిన క్రీస్తు సంఘ సేవకుని కుటుంబానికి వైరా చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డైరెక్టర్ డాక్టర్ గొల్లమందల నోవా ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన క్రీస్తు సంఘ సహోదరుడు నల్లగట్ల హానోకు (చిన్న రోశయ్య) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం నిర్వహించిన ఆయన జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమంలో డాక్టర్ గొల్లమందల నోవా పాల్గొని హానోకు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న ఆయన, కుటుంబానికి తనవంతు అండగా నిలిచేందుకు కెసిఎంబిఐ ద్వారా హానోకు సతీమణి నల్లగట్ల రోషమ్మకు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. సేవకుని కుటుంబాన్ని ఆదుకోవడం పట్ల పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైరా చర్చ్ ఆఫ్ క్రైస్ట్ డిప్యూటీ డైరెక్టర్ ఇస్నేపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అయినాల శ్రీనివాసరావు, సహోదరులు నల్లగట్ల ఆనందయ్య, మెరుగు యాకోబు, మన్నెం సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో ఘనంగా కోటి భగవద్గీత మహాయజ్ఞం

- ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు భగవద్గీత ప్రతుల పంపిణీ




**కల్లూరు, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి భగవద్గీత మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా కల్లూరు పట్టణంలో భగవద్గీత ప్రతుల పంపిణీ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, విస్తృతంగా జరిగింది. కల్లూరు పట్టణంలోని ప్రసిద్ధ స్వయంభు బ్రహ్మ సూత్రం ఉన్న శివాలయంలో కొలువైయున్న మహాగణపతికి తొలి పూజ సమర్పించి ఆయన ఆశీర్వాదం తీసుకొని, అనంతరం మహాదేవునికి తొలి భగవద్గీత సమర్పించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కల్లూరు మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కల్లూరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఆళ్లకుంట నరసింహారావు, స్థానిక కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు సమక్షంలో భగవద్గీత ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా జై హనుమాన్ సేవా ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

# విశ్వకర్మల ఐక్యతే సామాజిక సాధికారతకు పునాది: ఆర్. కృష్ణయ్య

## హైదరాబాద్‌ఢిల్లీ 1,700 కి.మీ. మహాపాదయాత్ర ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబరు 17(పి సి డబ్ల్యూ న్యూస్):** విశ్వకర్మల ఐక్యత, సాంస్కృతిక పూర్వ వైభవ పరిరక్షణ, సామాజిక సాధికారత, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాతినిధ్యం లక్ష్యంగా చేపట్టిన హైదరాబాద్‌ఢిల్లీ 1,700 కి.మీ. మహాపాదయాత్ర గురువారం బోరబండలోని శ్రీ విశ్వకర్మ దేవాలయం వద్ద ప్రారంభమైంది. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ విశ్వనాథుల పుష్పగిరి నేతృత్వంలో 74 రోజుల పాటు ఈ యాత్ర సాగనుంది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ దేశ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారి శ్రమకు తగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతినిధ్యం



కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు వృత్తిదారులకు మార్కెట్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సరైన ధర, ప్రభుత్వ కొనుగోళ్లలో అవకాశాలు కల్పించాలని సూచించారు. విశ్వకర్మలను కేవలం కార్మికులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని అన్నారు.కార్యక్రమంలో అతిథి వక్తగా పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ సంప్రదాయ వృత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాలని అన్నారు. "టూల్‌కిట్‌తో ఆగకుండా టెక్నాలజీ, బ్రాండింగ్, ఈ-కామర్స్, మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ను చేరుకోవాలి" అని పిలుపునిచ్చారు. విశ్వకర్మ యువత విద్య, నైపుణ్యం, పారిశ్రామికతపై దృష్టి పెట్టాలని సూచించారు.హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు సాగుతున్న ఈ యాత్ర కేవలం 1,700 కి.మీ. ప్రయాణం కాదు.. విశ్వకర్మల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారత, రాజకీయ భాగస్వామ్యం కోసం సాగుతున్న చైతన్య యాత్ర" అని గుజ్జ సత్యం పేర్కొన్నారు.విశ్వకర్మల ఐక్యత వర్ధిల్లాలి.. సామాజిక న్యాయం సాధించాలి.. ఆర్థిక స్వావలంబన పెరగాలి.. రాజకీయ ప్రాతినిధ్యం బలోపేతం కావాలి అని నాయకులు పిలుపునిచ్చారు.

# ఘనంగా శ్రీ శ్రీ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు......

**సుల్తానాబాద్, సెప్టెంబరు 17(పి సి డబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లోని స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో శ్రీ శ్రీ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ విరాట్ విశ్వకర్మ భగవంతుని చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి సంఘ నాయకులు చిలుమోజు వీరాచార్యులు విశ్వకర్మ పతాక ఆవిష్కరించి, యజ్ఞ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వీరాచారి మాట్లాడుతూ భూమి, నీరు,అగ్ని,గాలి బ్రహ్మ విష్ణు రుద్రుడు నక్షత్రా లేమియు లేనపుడు విశ్వకర్మ భగవానుడు అనంతం తాను సంకల్ప ప్రభావం చేత అవతరించారని,ఆ స్వయంభూ విశ్వకర్మ పరమేశ్వరునకే విశ్వాత్ముడు, విశ్వేశ్వరుజు, సహస్ర శిర్షుడు, సగుణ బ్రహ్మం, అంగుష్ట మాతృడు, జగద్రక్షకుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు మొదలైన అనంతనామనులు, అనంతరూపములు కలిగి,ప్రజాపతి విశ్వకర్మ మనః అని కృష్ణ యజుర్వేదమున విశ్వకర్మయే ప్రజాపతియైన




బ్రహ్మయనియు చెప్పబడినదని.సకల దేవాది దేవుడు విశ్వకర్మయే దేవతలకు ఆయుధాలు, మయసభ, లంకాపురి, రామసేతు, ద్వారకా నగరాన్ని, సకల చరాచర సృష్టిని నిర్మించాడని, విశ్వకర్మనే అపురూపమైన కళాకాండాలు కళా సంపదను అందించారని, విశ్వకర్మ భగవానుని పంచముఖముల నుండి పంచ బ్రహ్మలు, పంచ ఋషులు ఏర్పడ్డాయని,వారి సంతతివారే మను,మయ,త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞా, పంచ బ్రహ్మలు ఏర్పడినరని,వీరు మూలపురుషులైన విశ్వబ్రాహ్మణులై పంచ వృత్తులు చేస్తున్నారని అన్నారు.ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వం అధికారికంగా సెప్టెంబర్ 17న సెలవు దినంగా ప్రకటించడం అర్హనీయమని, ప్రభుత్వం వారు కులవృత్తుల వారికి చేయూతనిచ్చి ఆదుకోవాలని,పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని దేవుని ప్రార్థించామని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కుల పెద్దలు నాయకులు వీరాచార్యులు, పూసాల ఆంజనేయులు, దాసోహం వెంకటేశ్వర్లు,జూపాక కుమారస్వామి, శ్రీమంతుల సదానందం, శ్రీమంతుల సంపత్, వెల్ది గోపాల్, చిలుమోజు చంద్ర సేనా చారి,పూసాల సత్యనారాయణ, వెంకటాచారి, పూసాల రమేష్, సంతోష్,దాసోహం గోపికృష్ణ,వెంకటచారి, అనిల్,అబ్బోజి రాజనందం,శ్రీనివాస్, రవీంద్ర చారి,వెంకటస్వామి, శ్రీధర్,రాజ్ కుమార్, లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఎ) అంబటి జోజి రెడ్డి విడుదల చేసిన ప్రకటన

## ● యూపీఐ ఛార్జీలు: ప్రజల డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై మరో దాడి

## ప్రభుత్వం ఎండీఆర్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** యూపీఐ ద్వారా జరిగే వ్యాపారి లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలను ప్రవేశపెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ కొత్త విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది.రూ. 2,000కు మించిన అర్హత కలిగిన వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించాలన్న నిర్ణయం, యూపీఐని ప్రజల విస్తృత వినియోగంలోని డిజిటల్ చెల్లింపు మౌలిక వసతిగా మార్చిన సున్నా-ఎండీఆర్ విధానానికి మౌలికమైన విరుద్ధం. రైల్వేలు, టెలికమ్యూనికేషన్స్, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్స్ వంటి కీలక రంగాలు ఈ కొత్త విధానం పరిధిలోకి వస్తాయి.ప్రజా సంస్థలు, ప్రజా పెట్టుబడులు, దేశ సమిష్టి సాంకేతిక సామర్థ్యాల ద్వారా అభివృద్ధి చేయబడిన డిజిటల్ చెల్లింపు వ్యవస్థను క్రమంగా ప్రైవేటు లాభాలు, ఆర్థిక దోపిడీ తర్కానికి అప్పగించడాన్ని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. యూపీఐ కార్మికులు, చిన్న వ్యాపారులు, రైతులు, వినియోగదారులు, కోట్లాది సామాన్య ప్రజల రోజువారీ ఆర్థిక జీవితంలో కీలక భాగంగా మారింది. దీనిని ఆర్థిక మరియు చెల్లింపు సేవల మధ్యవర్తులకు మరో ఆదాయ మార్గంగా మార్చకూడదు.లావాదేవీలలో అత్యధిక భాగం ఉచితంగానే కొనసాగుతుందని ప్రభుత్వం చేస్తున్న వాదన అసలు సూత్రప్రాయమైన ప్రశ్నకు సమాధానం ఇవ్వదు. ఒకసారి యూపీఐలో ఛార్జీల ఆధారిత విధానం ప్రవేశపెడితే, భవిష్యత్తులో పరిమితిని మార్చవచ్చు, ఛార్జీల పరిధిని విస్తరించవచ్చు. కాబట్టి ప్రస్తుత చర్యను సున్నా-ఎండీఆర్ సూత్రాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే ప్రక్రియకు ఆరంభంగా భావించాల్సి ఉంది.సున్నా-ఎండీఆర్ విధానాన్ని బలహీనపరిచే విధాన మార్పులు, దేశీయ ప్రజా డిజిటల్ చెల్లింపు మౌలిక వసతులపై ప్రతికూల ప్రభావం చూపుతూ, పెద్ద విదేశీ సంస్థలతో సహా వాణిజ్య కార్డు మరియు చెల్లింపు నెట్‌వర్క్‌ల స్థాయిని చివరకు పెంచవచ్చని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. యూపీఐని ప్రైవేటు టోల్ రహదారిగా కాకుండా ప్రజా డిజిటల్ మౌలిక వసతిగా పరిగణించాలి. దాని విజయానికి కారణం దాని సరళత, సార్వత్రికత, పరస్పర అనుసంధాన సామర్థ్యం, తక్కువ వ్యయం. ఈ వ్యవస్థలో ఛార్జీలను ప్రవేశపెట్టడం వల్ల దాని విస్తృత వినియోగానికి దోహదపడిన మౌలిక సూత్రాలే దెబ్బతినే ప్రమాదం ఉంది.అందువల్ల, ప్రతిపాదిత ఎండీఆర్ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. వినియోగదారులు మరియు వ్యాపారులు ఇద్దరికీ నిజమైన సున్నా-వ్యయ యూపీఐ వ్యవస్థను కొనసాగించాలి. డిజిటల్ చెల్లింపు మౌలిక వసతుల నిర్వహణ, విస్తరణ ఖర్చులను లావాదేవీలపై మోపకుండా, ప్రభుత్వం పారదర్శకమైన ప్రజా నిధులను అందించాలి. అలాగే, సాధారణ ప్రజలు మరియు చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడకుండా బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థలోని భాగస్వాములకు స్థిరమైన ఆర్థిక వ్యవస్థను నిర్ధారించాలి.

# ఘనంగా తెలంగాణ విమోచన, ప్రధాని మోదీ జన్మదిన, విశ్వకర్మ జయంతి వేడుకలు..

## సేవా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ..

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..

**హుజూరాబాద్ సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం, దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం విశ్వకర్మ జయంతి వేడుకలను పురస్కరించుకుని హుజురాబాద్ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు మరియు జాతీయ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా మాజీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు, సాయుధ పోరాట యోధులకు గంగాడి కృష్ణారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ చరిత్రను, పోరాట స్ఫూర్తిని యువతకు గుర్తుచేస్తూ, దేశ సమైక్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని హుజురాబాద్ పట్టణంలోని రామాయణం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,అర్చన కార్యక్రమం నిర్వహించారు. సేవా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ప్రధాని మోదీ దేశానికి అందిస్తున్న సేవలను, చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి కొనియాడారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ప్రతి బూత్ లో అనేక సేవా కార్యక్రమాలు బిజెపి నాయకులు కార్యకర్తలు నిర్వహించాలని కోరారు.మోదీ ఆయురారోగ్యాలతో దేశానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. సృష్టికర్త, శిల్పకళా దైవమైన భగవాన్ శ్రీ విశ్వకర్మ జయంతి వేడుకల్లో గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. వృత్తి నిపుణులు, చేతివృత్తుల వారు, కార్మికులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంటూ శిల్పకళా ప్రవీణులకు విశ్వకర్మ జయంతి శు







భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ ,తూముల శ్రీనివాస్, సెంట్రల్ ఫిలిం బోర్డ్ మెంబర్ సబ్బని రమేష్, మాజీ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శిలు తిప్పబత్తిని రాజు ,గంట సంపత్ ,మరియు సీనియర్ నాయకులు కళ్లెపు సుధాకర్ రావు ,మెరుగు రాజిరెడ్డి, కొలిపాక శ్రీనివాస్, పోతుల సంజీవ్ ,అంకటి వాసు, మంచికట్ల మురళి, పదారి సుమన్ ,పదారి కొమురయ్య ,అజార్ పట్టణ ఉపాధ్యక్షులు యల్ల సంజీవరెడ్డి, ఇల్లందుల ప్రణీత్, ఈదులకంటి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సి మోర్చా అధ్యక్షులు ఎర్ర శ్రీధర్ ,ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొలిపాక వెంకటేష్ , ఎస్టీ మోర్చా అధ్యక్షులు కుతాడి కుమార స్వామి ,యువ మోర్చా అధ్యక్షులు మోటపోతుల రాకేష్, కార్యదర్శులు కొడిమ్యాల పవన్ కుమార్, గుర్రం సంతోష్ ,కొలుగూరి అనిల్, బొడిగ రాధ, కోశాధికారి క్యాష వెంకటేష్ ,సోషల్ మీడియా కన్వీనర్ దాసరి వీరన్న, కురిమిళ్ళ శ్రీధర్, బోరగాల సారయ్య , కార్యవర్గ సభ్యులు పిట్టల విజయ్, కుసుమ సమ్మయ్య, పట్టణ బూత్ అధ్యక్షులు ఆవుల సదయ్య, సబ్బని మాధవి, మొలుగురి అపర్ణ, మొలుగురి నగేష్ ,యాట రాజేష్ ఖన్నా ,గరిగే శివ కృష్ణ ,అపరాధ రమణ, తూర్పాటి శంకర్ ,తూర్పాటి రాం చంద్రం, పురాణం రాజు, తూర్పాటి ఐలయ్య, పిట్ట నర్సింగం ,పురాణం రాజు ,తూర్పాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బద్దిపల్లిలో అసంపూర్తి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

**వేలాది పేద కుటుంబాలకు అద్దె ఇండ్ల నుంచి విముక్తి కల్పించాలి**

**రాష్ట్ర బీసీ సంక్షేమం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎంఐఎం నేతల వినతి**

**స్పందించిన పొన్నం ప్రభాకర్...**

**పెండింగ్ ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ**





**కరీంనగర్, సెప్టెంబర్ 17(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి హావేలి మండలం బద్దిపల్లి గ్రామంలో 2004 నుంచి 2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయించి, వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు విడుదల చేయాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, రాష్ట్ర బీసీ సంక్షేమం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్తపల్లి మండలము బద్దిపల్లి గ్రామంలో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో.. కరీంనగర్ పట్టణానికి చెందిన అన్ని వర్గాల పేద ప్రజలకు సొంత ఇంటి కళను సాకారం చేసి, వారి దారిద్ర్యాన్ని దూరం చేయాలనే దృఢ సంకల్పంతో ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుమారు 4000మంది పేద ప్రజలను ఎంపిక చేసి, వారికి నివేశన స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. ఇందిరమ్మ బిల్లులను దఫా దఫాలుగా ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఇందులో సుమారు 50శాతం ఇండ్లు పూర్తయ్యాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలో ప్రభుత్వం మారాక, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు నిధుల మంజూరును నిలిపోయివేయడంతో, ఈ4వేల ఇండ్లలో సుమారు యాభై శాతం ఇందిరమ్మ ఇండ్లు కొన్ని 80శాతం, ఇంకొన్ని 50శాతం అసంపూర్తి దశలో మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఈఅసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయించడానికి ఈపేద కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారుల చేత క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి అసంపూర్తి లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను సర్వే చేయించి, ఈ ఇండ్ల నిర్మాణాలకు సరిపడా నిధులను మంజూరు చేయించి పెండింగ్లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయించి వాటిని పేద ప్రజలకు అందే విధంగా వినియోగం లోకి తీసుకొచ్చి అన్ని వర్గాల పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంఐఎం నేతల విజ్ఞప్తికి స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఇందిరమ్మ పెండింగ్ ఎండ్ల నిర్మాణానికి నిధులను సమకూర్చేలా తన శాయశక్తుల కృషి చేస్తానని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజీద్ హుస్సేన్ నాయకులు ఎంఏ సలీం, యూసుఫోద్దీన్ బాబు భాయి, తయ్యబ్, తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘యశోద’లో చిన్నారుల క్యాన్సర్‌కు అధునాతన వైద్యం

- సకాలంలో గుర్తిస్తే 8090 శాతం సంపూర్ణంగా కోలుకునే అవకాశం
- పుట్టుక నుండి 18 సంవత్సరాల వరకు క్యాన్సర్ వచ్చే అవకాశం
- తల్లిదండ్రుల అవగాహనతో సకాలంలో చికిత్స
- ఆధునిక వైద్యంతో మెరుగైన ఫలితాలు
- యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ పీడియాట్రిక్ ఆంకాలజీ అండ్ హెమటాలజీ క్లినికల్ డైరెక్టర్, హెచ్‌ఓడీ డాక్టర్ పరిణితరెడ్డి గుత్తా




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**చిన్నారుల జీవితంలో క్యాన్సర్ అనే మాట తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. అయితే ప్రస్తుత ఆధునిక వైద్య విధానాలతో పిల్లల్లో వచ్చే అనేక రకాల క్యాన్సర్లకు సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉందని, సకాలంలో వ్యాధిని గుర్తించి సరైన చికిత్స అందిస్తే 8090 శాతం వరకు చిన్నారులు సంపూర్ణంగా కోలుకునే అవకాశం ఉందని యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ పీడియాట్రిక్ ఆంకాలజీ అండ్ హెమటాలజీ క్లినికల్ డైరెక్టర్, హెచ్‌ఓడీ డాక్టర్ పరిణితరెడ్డి గుత్తా తెలిపారు.ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ పరిణితరెడ్డి గుత్తా మాట్లాడుతూ.. చిన్నారుల క్యాన్సర్, దాని చికిత్స విధానాలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. పిల్లల్లో క్యాన్సర్ అరుదైన వ్యాధి అయినప్పటికీ, దానిని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. పుట్టిన నాటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు చిన్నారుల్లో వివిధ రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. పిల్లల్లో వచ్చే క్యాన్సర్ల చికిత్స పెద్దవారిలో వచ్చే క్యాన్సర్ల చికిత్సకు భిన్నంగా ఉంటుందని వివరించారు. చిన్నారుల వయస్సు, క్యాన్సర్ రకం, వ్యాధి దశ, ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్సా విధానాన్ని నిర్ణయిస్తారని చెప్పారు.పిల్లల క్యాన్సర్ చికిత్సలో అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ (ఎముక మజ్జ మార్పిడి) వంటి ఆధునిక వైద్య విధానాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల క్యాన్సర్ చికిత్సలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.చిన్నారుల్లో నిరంతరం తగ్గని జ్వరం, అసాధారణ రక్తస్రావం, కీళ్ల నొప్పులు, రక్తహీనత, శరీరంలో కణతలు, వాపులు, తగ్గని వాంతులు, కొత్తగా మెల్లకన్ను రావడం, రాత్రివేళల్లో తగ్గని తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన క్యాన్సర్ అని భావించాల్సిన అవసరం లేదని, అయితే అసాధారణ లక్షణాలు నిరంతరం కొనసాగితే వైద్యుల సలహా తీసుకోవడం ముఖ్యమని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు చికిత్స అందించడమే కాకుండా, వారి ఆరోగ్యాన్ని తిరిగి అందించి, బాల్యాన్ని, చదువును, భవిష్యత్తును సాధారణ జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యంగా వైద్యులు కృషి చేస్తున్నారని డాక్టర్ పరిణితరెడ్డి గుత్తా తెలిపారు. క్యాన్సర్‌పై భయాన్ని తగ్గించి, తల్లిదండ్రుల్లో ధైర్యాన్ని పెంచడం ద్వారా చిన్నారులకు సకాలంలో వైద్యం అందించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.చిన్నారుల క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ నెలను ‘చిల్డ్రన్స్ అవేర్‌నెస్ మంత్’గా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం, ఆలస్యం చేయకుండా నిపుణుల వైద్య సలహా పొందడం, వైద్యుల సూచనల మేరకు చికిత్స కొనసాగించడం ద్వారా చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్ బారిన పడిన ప్రతి చిన్నారి మళ్లీ ఆరోగ్యంగా నవ్వుతూ తన బాల్యాన్ని ఆస్వాదించాలన్నదే వైద్యుల కృషి వెనుక ఉన్న మానవీయ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ డిప్యూటీ జనరల్ మేనేజర్ అనీష్ కుమార్ తివారి, మేనేజర్లు బాలకృష్ణ, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి అండగా న్యాయ సేవాధికార సంస్థ

స్వశక్తి సదన్, ఆనంద ఆశ్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ పర్యటన

నైపుణ్య శిక్షణతో మహిళలు స్వావలంబన దిశగా అడుగులు వేయాలి










**హనుమకొండ,సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :అవసరాల్లో ఉన్న వారికి అండగా నిలిచి, వృద్ధుల సంక్షేమం, మహిళల స్వావలంబనకు అవసరమైన సహాయ సహకారాలు అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ పేర్కొన్నారు. కాశీబుగ్గలోని స్వశక్తి సదన్, ఆనంద ఆశ్రమం వృద్ధాశ్రమాలను ఆమె సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మొదట స్వశక్తి సదన్‌ను సందర్శించిన న్యాయమూర్తి అక్కడ ఆశ్రయం పొందుతున్న వారితో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాలు, అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఆరా తీసి, అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఆమె ధ్రువపత్రాలను అందజేశారు. కేవలం శిక్షణతో సరిపెట్టుకోకుండా నేర్చుకున్న నైపుణ్యాలను ఉపాధిగా మార్చుకోవాలని, కుట్టు పనితో స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం సామాజికంగా ఎంతో ప్రాధాన్యమైన అంశమని పేర్కొన్నారు.స్వశక్తి భవన్ ఇన్‌చార్జి వనం బాలరాజు కేంద్రం కార్యకలాపాలు, శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను వివరించారు.తదుపరి ఆనంద ఆశ్రమం వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కందుకూరి పూజ వృద్ధులతో కొంత సమయం ఆప్యాయంగా గడిపారు. వారి ఆరోగ్యం, ఆహారం, వసతి, వైద్య సంరక్షణతో పాటు అందుతున్న ఇతర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధుల అవసరాలను గుర్తించి వారికి తగిన సహకారం అందించాలని, వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయతతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సూచించారు.ఆనంద ఆశ్రమం నిర్వహణ తీరుతెన్నులు, వృద్ధులకు అందిస్తున్న సేవలను ఈటెల సమ్మయ్య వివరించారు.కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి. శ్రీనివాసరావు, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ పి. జయశ్రీ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా పాలనకు ప్రధాన లక్ష్యం


- తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్



**మహబూబాబాద్, ప్రతినిధి సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అధికారిక వేడుకల్లో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా పాలన దినోత్సవ ప్రాధాన్యతను స్మరించుకుంటూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ నిబద్ధతను ప్రస్తావించారు.ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజా పాలన మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా ఎస్పీ శబరీష్, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరిపెడలో నూతన సివిల్ కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన

# త్యాగాల జ్యోతితో తెలంగాణ విలీనం






- అమరవీరుల స్ఫూర్తి చిరస్మరణీయం
- తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు చాటాలి: బాగం హేమంతరావు

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి పోరాట స్ఫూర్తి ఫలితంగానే తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనమైందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంపై జాతీయ పతాకాన్ని బాగం హేమంతరావు, అరుణ పతాకాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం కూడా నిజాం రాజు తన పాలన కొనసాగించేందుకు ప్రయత్నించిన సమయంలో కమ్యూనిస్టులు ప్రజలను సమీకరించి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. వేలాది మంది తమ ప్రాణాలను త్యాగం చేసిన పోరాటం తెలంగాణ ప్రజల హక్కులు, గౌరవం, స్వేచ్ఛ కోసం సాగిందని పేర్కొన్నారు.తెలంగాణ సాయుధ పోరాటం నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంతోనే పరిమితం కాలేదని, పేదలు, కూలీలు, రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో కూడా సాగిందన్నారు. పోరాట కాలంలో లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఉందని తెలిపారు. నాటి త్యాగాలు తెలంగాణ సమాజంలో సామాజిక మార్పుకు బలమైన పునాది వేశాయని పేర్కొన్నారు.ప్రస్తుత సమాజంలోనూ ఆర్థిక అసమానతలు, సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని హేమంతరావు అన్నారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే గొంతుకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం ఉద్యమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ పోరాట యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అమరవీరుల ఆశయాలను గుర్తుచేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈ సభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ సభకు ఖమ్మం నుంచి భారీగా తరలిన శ్రేణులు**

భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు బహిరంగ సభకు ఖమ్మం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. వందలాది మంది సీపీఐ శ్రేణులు గురువారం స్థానిక పార్టీ కార్యాలయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన బహిరంగ సభకు బయలుదేరారు.

# గ్రామాభివృద్ధి కోసం నూతన అడుగులు





- కాంగ్రెస్‌లో తుమ్మల సురేష్ చేరిక
- మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక..
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సమిష్టి కృషికి సంకల్పం

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్)** :గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమిష్టి ప్రగతిని లక్ష్యంగా చేసుకుని ఖమ్మం రూరల్ మండలం ఎంవీ పాలెం గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం పార్టీ నాయకులు తుమ్మల సురేష్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా తుమ్మల సురేష్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామానికి వర్తింపజేసి ముందుకు తీసుకెళ్లేందుకు అందరినీ కలుపుకుని పనిచేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయడంతో పాటు ప్రజల అవసరాలు, సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.పదవులు, రాజకీయాలకంటే గ్రామ ప్రజల సంక్షేమమే ముఖ్యమని, గ్రామం అభివృద్ధి చెందితేనే ప్రతి కుటుంబం ముందుకు సాగుతుందనే భావనతో సమిష్టి కృషికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎంవీ పాలెం గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. గ్రామంలో మౌలిక వసతులు, ప్రజా అవసరాలు, సంక్షేమ కార్యక్రమాలపై సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వారి ఆశలుఆకాంక్షలకు అండగా నిలవడం, అందరినీ కలుపుకుని అభివృద్ధి వైపు అడుగులు వేయడమే తన లక్ష్యమని అందుకే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నమ్మి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తుమ్మల సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట వీరభద్రం, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరి హరినాథబాబు, ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, మద్ది కిషోర్‌రెడ్డి, సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్, సర్పంచ్ పాపా నాయక్, ప్రతాపనేని రఘు, గుండు నాగేశ్వరావు, బుర్ర రాజేష్, టీం పొంగులేటి పీఎస్‌ఆర్ సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు..

**- కిసాన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ..**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కరీంనగర్ నగరపాలక సంస్థ 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ఆధ్వర్యంలో కిసాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉత్సాహాన్ని నింపేలా ఈ సేవా కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు లు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధికి, పేదల సంక్షేమానికి అంకితమై పనిచేస్తున్నారన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, విద్యారంగ బలోపేతానికి ప్రధాని మోదీ తీసుకుంటున్న చొరవ ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పుట్టినరోజు వేడుకలను కేవలం ఆర్భాటాలకు పరిమితం చేయకుండా, విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేయడం ద్వారా కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ గొప్ప సేవాభావాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదువుకోవాలని, దేశ భవిష్యత్తులో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు , కార్పొరేటర్ ఏపీపీ చంద్ర బీజేపీ నాయకులు బండిపల్లి సంజీవ్, గాలి సురేష్, సతీష్, నాగేంద్ర, మధు, రాజు, భాను, శేషిధర్, వేణు, పవన్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# ప్రధాని మోడీ జన్మదినోత్సవం.. ఘనంగా 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం..


**- కపిల్ బాల కుటీర్లో విద్యార్థుల తో కలిసి ఆశీర్వాద దీపం వెలిగించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17(పిసి డబ్ల్యూ న్యూస్):** దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్లోని బాల కుటీర్ లో విద్యార్థుల సమక్షంలో గురువారం రాత్రి 7 గంటలకు చేపట్టిన 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం కపిల్ బాల కుటీర్ విద్యార్థుల తో కలిసి ప్రత్యేకంగా 'ఆశీర్వాద దీపం' వెలిగించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ అందిస్తున్న అంకితభావంతో కూడిన సేవలను, పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న విప్లవాత్మక పథకాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దేశ ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని మోడీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశానికి మరింత కాలం సేవలందించాలని ఆకాంక్షిస్తూ, ఆ దిశలోనే ఆ భగవంతున్ని వేడుకుంటూ ఆశీర్వాద దీపం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ బాల కుటీర్ విద్యార్థులకు స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, గుంజేటి శివ , ఆడిచర్ల రాజు, ఈస్ట్ జోన్ అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్ , కచ్చకాయల రాజు , శశి, జీపు సత్యం, కార్పొరేటర్ సత్యవతి , మునీందర్, బల్బీర్ సింగ్ , పాశం తిరుపతి పాల్గొన్నారు

# 50వ డివిజన్లో ఘనంగా 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం..

**- ప్రధాని మోడీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బిజెపి పార్లమెంటు కన్వీనర్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**



**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల సందర్భంగా జాతీయ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం రాత్రి 50వ డివిజన్లో 'ఆశీర్వాద దీపం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి, రాత్రి సరిగ్గా 7 గంటలకు ఆశీర్వాద దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని, దేశ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలు మరింతకాలం కొనసాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు, దేశ సర్వతోముఖాభివృద్ధికి ప్రధాని మోడీ చేస్తున్న కృషిని కొనియాడారు. మోడీ నాయకత్వంలో దేశం విశ్వవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు గడిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి గడపకూ చేరవేయాలని పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, రాగి సత్యనారాయణ అశోక్ జి వంగల రవి గోపాల్ నరాల శంకర్ రుద్రం లక్ష్మణ్ చెల్లోజు సత్యనారాయణ మాటూరు వెంకటస్వామి కాసం సంతోష్ దయ్యాల మల్లేశం చంద్రగిరి వేణు జాడి బాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం సాగిన ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించాలి: గండ్ర జ్యోతి





**భూపాలపల్లి, సెప్టెంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి తెలంగాణ ప్రజలకు జాతీయ సమైక్యతా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో చారిత్రాత్మకమైన రోజని అన్నారు. నిజాం పాలన నుంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి ప్రజలు సాగించిన పోరాటాలు, చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాడిన అమరవీరులకు నివాళులర్పించారు. పరకాల గడ్డపై జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, పరకాల పోరాటాన్ని 'రెండో జలియన్‌వాలాబాగ్'గా అభివర్ణిస్తారని తెలిపారు. తెలంగాణ సాధన కోసం 1969లో జరిగిన ఉద్యమం, 2001లో కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన మలిదశ ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ స్ఫూర్తితో తెలంగాణ ప్రజలు ఏకమై రాష్ట్రాన్ని సాధించుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు చైతన్యవంతులై ఏకమైతే ప్రజా ఉద్యమాలు మరింత బలపడతాయని, ఉద్యమాల స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, రైతుల పరిస్థితి, మహిళల భద్రతస్వావలంబన, యువతకు ఉద్యోగ అవకాశాలు, పేదలకు సంక్షేమం, గ్రామాల్లో అభివృద్ధి వంటి అంశాలను ప్రజలు పరిశీలించాలని గండ్ర జ్యోతి కోరారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా నిలిచి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ యువతలో చైతన్యం పెంపొందించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను చేపడతామని గండ్ర జ్యోతి తెలిపారు.

# అంబేద్కర్ ఆశయాల బాటలో...

**- మహనీయుడు స్థాపించిన పార్టీలో సేవచేసే అవకాశం నా అదృష్టం..**

**- బహుజనుల అభ్యున్నతికి అంకితమవుతా**

**- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్వాలే) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొమ్ము ప్రసాద్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలతో ఏర్పాటైన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్వాలే) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొమ్ము ప్రసాద్ ఎన్నికయ్యారు. బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన పార్టీలో జిల్లా అధ్యక్షుడిగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన జీవితంలో గర్వకారణమని, అదృష్టంగా భావిస్తున్నానని కొమ్ము ప్రసాద్ తెలిపారు. అంబేద్కర్ చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం మార్గంలో నడుస్తూ దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్వాలే) జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరిగోమ్ముల స్నేహలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్ మాట్లాడుతూ.. దళిత, బహుజనులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో పార్టీ పనిచేస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ పార్టీని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పార్టీ జాతీయ అధ్యక్షులు రాందాస్ అత్వాలే నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పసుల రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య మాట్లాడుతూ.. దళిత, బహుజన వర్గాల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్వాలే) కృషి చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విద్య, రాజకీయాలు, పారిశ్రామిక రంగాల్లో ఎదగడానికి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పార్టీ పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరిగోముల స్నేహలత మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళలకు ఓటు హక్కుతో పాటు సమాన హక్కుల కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషిని గుర్తుచేశారు. మహిళలు, దళిత, బహుజన వర్గాలు విద్యావంతులుగా, రాజకీయ నాయకులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగడమే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొమ్ము ప్రసాద్‌ను ఎన్నుకుని పార్టీ నాయకులు కండువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ.. అంబేద్కర్ వంటి మహనీయుడు స్థాపించిన పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తనకు అప్పగించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. జిల్లా అధ్యక్ష పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తానని తెలిపారు. జిల్లాలోని దళిత, బహుజనులు, మహిళలు, పేదలు, అణగారిన వర్గాల సమస్యలను తెలుసుకుని, వారి హక్కులు, అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తానని చెప్పారు. అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణం కోసం పార్టీ కార్యకర్తలను కలుపుకుని గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరికీ గౌరవం, సమాన అవకాశాలు, విద్యతో పాటు ఆర్థికంగా ఎదిగే అవకాశం లభించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తన ముందున్న లక్ష్యమని కొమ్ము ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బానోతు రవి, కొండ వెంకటేశ్వర్లు, బొమ్మరం కృష్ణ, నేలమర్రి రమేష్ పాల్గొన్నారు.

# కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రజా పాలన దినోత్సవం వేడుకలు...

**• జాతీయ జెండా ఎగురవేసిన మార్కెట్ చైర్పర్సన్ తౌటం ఝాన్సీ రాణి...**



**కమలాపూర్ సెప్టెంబర్ 17(పిసి డబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసి మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ విమోచన కోసం పోరాటం చేసిన అమరుల త్యాగాల ఫలితం మన స్వేచ్ఛ స్వచ్ఛమైన పాలనకు నాంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య డైరెక్టర్లు జనగాని శివకృష్ణ, అకినపల్లి బిక్షపతి,గట్టు శ్రీధర్ కిన్నెర కృష్ణమూర్తి చకిలం దయాకర్ నెగ్గుల లింగయ్య, మహమ్మద్ చిన్న యాకుబ్, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సంకల్ప ఆశీర్వాద దీపా కార్యక్రమం....

**• తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహా నాయకుడు నరేంద్ర మోడీ.... కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్....**



**కమలాపూర్ సెప్టెంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మన భారత ప్రధాని నరేంద్ర మోడీ 76 వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ భారతదేశ ప్రజలు సురక్షితంగా స్వేచ్ఛగా జీవించడం కోసం తన జీవితాన్ని దేశ ప్రజల కోసం అంకితం చేసి న మహోన్నతమైన గొప్ప వ్యక్తి మన ప్రియతమ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని కొనియాడారు. ప్రధానికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేస్తూ ఆయుష్ ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు కలకాలం వర్ధిల్లుతూ భారతదేశ ప్రజలకు మరింత సేవలందించాలని అన్నారు. 25 సంవత్సరాల సుపరిపాలన అందిస్తూ ప్రపంచ దేశాల ప్రజల మన్ననలు పొందిన నరేంద్ర మోడీ మన భారత దేశానికి సేవలు అందించడం మన అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, శనిగరం సర్పంచ్ రాజు, బిజెపి సీనియర్ నాయకులు తుమ్మ శోభన్,డాక్టర్ సాంబయ్య,బండి కళాధర్, గంధసిరి రవి,మౌటం రమేష్ కనుకుంట్ల అరవింద్,పిల్లి సతీష్,మేకల రవి, సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.